# రాజధాని వార్తలు

కలం✓

## ప్రజలు, ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాల్సిందే

ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడుకోవడంలో మెళకువలను ప్రజలే ముందుండి తెలుసుకోవాలి. కోవిద్ -19 మూడవ తరంగంతో ప్రభుత్వం ఇప్పటికే సూచించిన విధంగా కోవిద్ నియంత్రణ, నియమాలను (మాస్క్ ధరించండి,చేతులను శుభ్రంగా కడుక్కోండి, సురక్షిత దూరాన్ని పాటించండి.) ప్రజలు తప్పక పాటిస్తేనే కోవిద్ ఉధృతి తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా కోవిద్ టీకా వేసుకోవటానికి ప్రజలు త్వరపడాలి. ఎందుకంటే కోవిద్ వ్యాధి తీవ్రత టీకా వేసుకున్నవారిలో తక్కువగా ఉంటోందని వివిధ శాస్త్రీయ పరిశోధనలు జరిపిన ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు తెలిపాయి. కాబట్టి కుటుంబసభ్యులందరికి అవగాహనా కల్పించి టీకా వేసుకునేందుకు ప్రోత్సహించండి.

ఇక మారుతున్న ఈ సీజన్లో మలేరియా, డెంగ్యూ, చికెనుగుణ్య వంటి వ్యాధులు కూడా ప్రబలుతున్నాయని ప్రభుతం ఇప్పటికే ప్రజలను అప్రమత్తం చేస్తోది. వ్యాధి సోకినప్పుడు సొంతవైద్యం చేసుకోకుండా దగ్గరలో ఉన్న హాస్పిటల్లో చికిత్స చేయించుకోవాలి. లేకపోతె వ్యాధికి సరైన వైద్యం అందకపోవచ్చు. ఉదాహరణకు ఇటీవల మంగళగిరి దగ్గరలోని ఒక పెద్ద హాస్పిటల్కు చెందిన ప్రఖ్యాత డాక్టర్ డెంగ్యూ వ్యాధి సోకితే కోవిద్-19 వ్యాధి అని చికిత్స చేసుకోవటంతో ప్రాణాన్ని కోల్పోవలసి వచ్చింది. అదొక బాధాకరమైన విషయం. అందువల్ల అనారోగ్యం పాలైతే సొంత వైద్యం మానుకుని ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా హాస్పిటల్కు వెళ్లి నిపుణులైన వైద్యులతో చికిత్స చేయించుకోవాల్సిన బాధ్యత ప్రజలదే. అలాగే ప్రభుత్వాలు కూడా ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించి వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలి. ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించటంలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలి. కొన్ని ప్రైవేటు హాస్పిటల్స్ లో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించటంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. అలాంటి

హాస్పిటల్స్ పై ప్రభుత్వ పర్యవేక్షణ అవసరమే. సామజిక బాధ్యతగా ప్రైవేటు హాస్పిటళ్ళ యజమానులు ప్రజలందరికి వైద్యం అందించే దిశగా ప్రభుత్వంతో కలసి పని చేయాలి. స్వచ్ఛంద సంస్థలు కూడాతమ వంతు బాధ్యతగా ప్రజలను చైతన్యపరచటం చేస్తే ప్రజలకు ఆరోగ్యం అందించిన వారవుతారు.ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు , ప్రజలందరూ తమ తమ బాధ్యతలను, హక్కులను గుర్తుతో పనిచేసి అత్యున్నత సమాజ స్థాపనకు ప్రయత్నించాలి. అప్పుడే రాష్ట్రాలుగాని , దేశం గాని పురోగమిస్తుంది. ఆర్థిక స్వావలంబన దిశగా కూడా వేగంగా పయనించవచ్చు. ఆదిశగా అప్రమత్తంగా లేకపోతె అనేక నష్టాలే !!!


## జీరో రూపాయి నోట్



**రాజధాని వార్తలు, ఇంటర్నెట్ డెస్క్:** జీరో రూపాయి నోట్ అనేది ఒకటుందన్న విషయం చాలా మందికి తెలియదు. కానీ ఇదో సైలెంట్ రివల్యూషన్‌లా ఇండియాలో విస్తరిస్తోంది. ఇది ఏంటో తెలుసుకుందాం.

**జీరో రూపాయి నోట్:** ప్రభుత్వ అధికారులు లంచం అడగడం... ప్రజలు లంచం ఇవ్వడం ఇండియాలో కామన్‌గా జరుగుతోంది. చట్టప్రకారమైతే...లంచం అడగడం, ఇవ్వడం రెండూ నేరమే. అమెరికాలో జాబ్ చేసిన సాఫ్ట్‌వేర్ ఎన్నారై ఆనంద్ ఇండియా వచ్చినప్పుడు ఇక్కడ జరుగుతున్న అవినీతిని చూసి ఆశ్చర్యపోయారు. దీనికి ఎలా బ్రేక్ వెయ్యాలి అని ఆలోచించిన ఆయన... ఫిఫ్త్ పిల్లర్ అనే స్వచ్ఛంద సంస్థను 2007లో స్థాపించారు. ఈ సంస్థ జీరో రూపీ నోట్లను తయారుచేస్తోంది. ఈ నోట్లు రెగ్యులర్ కరెన్సీలాగా చెల్లవు. ఎవరైనా

**అధికారులు లంచం అడిగినప్పుడు...** ఏసీబీ అధికారులకు చెప్పినా, చెప్పకపోయినా... లంచం ఇవ్వడం నేరం. కాబట్టి... ఏసీబీ అధికారులు పట్టుకుంటే... ఆ అవినీతి అధికారి... "అతను లంచం ఇచ్చాడు కాబట్టే... నేను తీసుకున్నాను... కాబట్టి... లంచం ఇచ్చినందుకు అతన్ని కూడా అరెస్టు చెయ్యాలి" అని మెలిక పెట్టే ప్రమాదం ఉంది. అందువల్ల ఈ జీరో నోట్లను ఇస్తే... లంచం ఇచ్చినట్లు అవ్వదు. అదే సమయంలో... అవినీతి అధికారి బండారం బయటపెట్టినట్లూ అవుతుంది అన్నది




ప్రభుత్వ అధికారి లంచం అడిగితే... ఈ నోట్లను ఇవ్వండి అని కోరుతున్నారు ఆనంద్. వీటిని ఇచ్చే ముందు... అవినీతి నిరోధక వ్యవస్థ అధికారులకు సమాచారం ఇస్తే , నోట్లను ఇచ్చాక ...లంచావతారం సంగతి అధికారులు చూసుకుంటారని ఆనంద్ చెబుతున్నారు. వీటిపై అమౌంట్ బదులు జీరో ఉంటుంది. చూడటానికి రూ.50 నోటు లాగా ఉంటుంది. ఈ నోట్లపై నేను లంచం ఇవ్వను, తీసుకోను అనే ప్రమాణం రాసి ఉంటుంది.

2007 నుంచి 2014వరకూ ఫిఫ్త్ పిల్లర్ సంస్థ 25 లక్షల నోట్లను ప్రింట్ చేసి ప్రజలకు ఇచ్చింది. ఈ నోట్లను మొదటిసారి చెన్నైలో ఉపయోగించారు. అక్కడ సక్సెస్ అవ్వడంతో... ఆ తర్వాత తమిళంతోపాటూ... తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ నోట్లను ప్రింట్ చేస్తున్నారు.

ఈ జీరో రూపీ నోట్ కాన్సెప్ట్. దీనికి యువత నుంచి మంచి స్పందన వస్తోంది.

**ఇండియాలో అవినీతి జీరో అవ్వాలి అనే ఉద్దేశంతో...** జీరో రూపీ నోట్ అని పేరు పెట్టారు. ఈ జీరో రూపీ నోట్లను ఈ సంస్థ... రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, మార్కెట్ ప్లేసుల్లో ఉచితంగా ఇస్తోంది. తద్వారా ప్రజల్లో దీనిపై అవగాహన కల్పిస్తోంది. ఎవరికైనా ఈ నోట్లు కావాలంటే... సంస్థ వెబ్‌సైట్ (https://5thpillar.org)లోకి వెళ్లి కోరవచ్చు.

## జీరో ఎఫ్ఐఆర్ అంటే ఏమిటి ?

### ◆ జీరో ఎఫ్ఐఆర్ గురించి మనలో ఎంతమందికి తెలుసు !!!

చాలామంది పోలీసులకు సైతం జీరో ఎఫ్ఐఆర్‌పై అవగాహన లేకపోవడం శోచనీయం. 'జీరో ఎఫ్ఐఆర్' అంటే ఘటన జరిగిన ప్రదేశం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో తెలియనప్పుడు దగ్గరలో ఉన్న ఎదో ఒక పోలీస్ స్టేషన్‌కి వెళ్లి పిర్యాదు చేయవచ్చు. సంఘటన జరిగిన ప్రదేశం మా స్టేషన్ పరిదిలోకి రాదు అని చెప్పడానికి వీలులేదాని న్యాయవాది ఎస్ ఆర్.ఆంజనేయులు పేర్కొన్నారు. ఫిర్యాదును తప్పకుండా కేసు నమోదు చేయించాలి.

◆ప్రతీ పోలీస్ స్టేషన్‌కు జ్యూరిడిక్షన్ పరిధి ఉంటుంది. ఆ పరిధిలోకి వచ్చే ఫిర్యాదులను మాత్రమే వారు స్వీకరిస్తారు. కానీ జీరో ఎఫ్ఐఆర్‌తో తమ పరిధిలోకి రాకపోయినా సరే ఫిర్యాదును స్వీకరించి ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు చేయాల్సి ఉంటుంది.

సాధారణంగా ప్రతీ ఎఫ్ఐఆర్‌కి సీరియల్ నంబర్‌తో పాటు/సంవత్సరం సూచిస్తూ నంబర్ కేటాయిస్తారు. కానీ జీరో ఎఫ్ఐఆర్‌లో నంబర్ లాంటిదేమి ఉండదు. మొదట ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆ తర్వాత సంబంధిత పోలీస్ స్టేషన్‌కు దాన్ని బదిలీ చేయాలి. బదిలీ చేసేంతవరకు అక్కడి పోలీసులే దానిపై విచారణ జరపాల్సి ఉంటుందాని న్యాయవాది ఎస్.ఆర్ ఆంజనేయులు పేర్కొన్నారు. ఫిర్యాదును తీసుకొనకుండా ఉంటే సంబంధిత పోలీసుల మీద సుపరిండెంట్ ఆఫ్ పోలీసు, ఐజి మరియు డీజీపీల పిర్యాదు చేసిన వెంటనే సంబంధిత పోలీసు అధికారి మీద వెనువెంటనే చర్యలు తీసుకొని తీరాలి. జీరో ఎఫ్ఐఆర్ ప్రతి పోలీస్ స్టేషన్ నందు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక సర్క్యులర్ ఆర్సీ నెం 599/L&O/III/2019 జారీచేయడం జరిగింది

### జీరో ఎఫ్ఐ ఆర్ అంశం ఎప్పుడు తెరపైకి వచ్చింది !

కిడ్నాప్, మిస్సింగ్, యాక్సిడెంట్, దొంగతనాలు ఇలాంటి కేసుల్లో చాలామందికి ఎదురయ్యే కామన్ సమస్య ఒకటి ఘటన జరగ్గానే చాలామంది సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు పరుగుకెత్తుకెళ్తారు. కానీ అది తమ పరిధిలోకి రాదని అక్కడి పోలీసులు కేసు నమోదుకు నిరాకరిస్తారు. దీంతో అక్కడి నుంచి మరో పోలీస్ స్టేషన్‌కు వాళ్లూ కాదంటే ఇంకో పోలీస్ స్టేషన్‌కు ఇలా తిరగక తప్పదు.

తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ లో ప్రియాంకరెడ్డి హత్యాచార ఘటనలోనూ ఇదే జరిగింది. ప్రియాంక రెడ్డి మిస్సింగ్ కేసు నమోదు కోసం ఆమె తల్లిదండ్రులు రెండు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఒకవేళ ఎఫ్ఐఆర్ త్వరగా నమోదై పోలీసులు త్వరగా రంగంలోకి దిగి ఉంటే ప్రియాంకరెడ్డి హత్యాచారనికి గురయ్యేది కాదేమో చాలామంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చాలామందికి తెలియని 'జీరో ఎఫ్ఐఆర్' అంశం తెర పైకి వచ్చింది.

– ఆజమ్, సీనియర్ పాత్రికేయులు

1వ పేజీ తరువాయి

# ముఖ్యమంత్రి ప్రసంగం

విత్తనం నుంచి పంట అమ్మకం వరకు రైతుకు తోడుండే రైతు భరోసా కేంద్రాలు మన గ్రామాల్లోనే ఏర్పాటు చేశాం. ఈ ఆర్బీకేల ఏర్పాటుతో దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని విధంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకువచ్చాం.

ఈ 26 నెలల కాలంలో, వైయస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా 31.07 లక్షల రైతులకు రూ. రూ.3,788 కోట్లు అందించాం. వైయస్సార్ సున్నా వడ్డీ ద్వారా 67.50 లక్షల రైతులకు రూ.1,261 కోట్లు ఖర్చు చేశాం. రూ.2,000 కోట్లతో ప్రకృతి వైపరీత్యాల నిధిని... రూ.3,000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశాం.

ధాన్యం సేకరణ-కొనుగోళ్ళ కోసం ఇప్పటిదాకా రూ.32 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తే... పత్తికి మరో రూ.1800 కోట్లు, ఇతర పంటల కొనుగోళ్ళకు మరో రూ.6,434 కోట్లు వ్యయం చేశాం! ఏ ఒక్క రైతుకూ ఏ ఒక్క ఇబ్బందీ రాకూడదని తపించాం.

గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ. 960 కోట్ల ధాన్యం సేకరణ బకాయిల్ని, గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన-రూ. 9,000 కోట్ల విద్యుత్తు బకాయిల్నిబీ రూ.384 కోట్ల విత్తన బకాయిల భారాన్ని కూడా మనమే చిరునవ్వుతో మోశాం.

ఇవి కాకుండా... ఇన్‌పుట్ సబ్సిడీకి రూ.1,039 కోట్ల చెల్లింపుల ద్వారా... పాడి రైతులకు దన్నుగా నిలుస్తూ ఏపీఅమూల్ పాలవెల్లువ ద్వారా... వైయస్సార్ జలకళ ద్వారా... ఆక్వా రైతుకు కరెంటు సబ్సిడీకి రెండేళ్లలో రూ.1,560 కోట్లు ఇవ్వటం ద్వారా... శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో ముందడుగు వేయటం ద్వారా... నవరత్నాల పథకాలను పేద రైతు కుటుంబాలకు అందించటం ద్వారా... రైతు సాధికారతలో చరిత్రలో ఏ ప్రభుత్వం ఎన్నడూ వేయనన్ని ముందడుగులు వేశాం అని సవినయంగా చెపుతున్నాను.

మన గ్రామంలోగానీ, మన నగరంలో, కేవలం ఈ 26 నెల్లోనే ఏం మార్పులు వచ్చాయో... ఎలాంటి మార్పులు వచ్చాయో ఒక్కసారి గమనించండి..

ప్రతి 2,000 మందికి 12 శాశ్వత ఉద్యోగాలతో, అక్షరాలా 1.3 లక్షల శాశ్వత ఉద్యోగాలు కల్పించి... 500కు పైగా సేవలతో ఒక గ్రామ/వార్డు సచివాలయం ఏర్పాటు ద్వారా పౌర సేవల్లో దేశంలోనే సరికొత్త విప్లవం తీసుకువచ్చాం.

ప్రతినెలా 1వ తేదీ సూర్యోదయానికి ముందే అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువుల పింఛన్లు వారి తలుపు తట్టి మరీ... ఒక్క రూపాయి కూడా లంచం తీసుకోకుండా, 2.7 లక్షల మంది వాలంటీర్లు ఇంటికి వచ్చి ఇచ్చి వెళ్ళే వ్యవస్థ కేవలం మనకే సొంతం.

ప్రతి 2,000 మందికి పౌర సేవలు అందించే గ్రామ సచివాలయం, అక్కడి నుంచి నాలుగు అడుగులు వేస్తే రైతులకు విత్తనం నుంచి పంట అమ్మకం వరకు అన్ని విధాలా సహాయం చేసే రైతు భరోసా కేంద్రాలు... అక్కడినుంచి నాలుగు అడుగులు వేస్తే కనిపించే వైయస్సార్ విలేజ్ క్లినిక్‌లు... మరో నాలుగు అడుగులు వేస్తే కనిపించే ఇంగ్లీష్ మీడియం స్కూల్... మరో నాలుగు అడుగుల దూరంలోనే మీ గ్రామంలోనే డిజిటల్ గ్రంథాలయాలు, మరో నాలుగు అడుగుల దూరంలో ఇంగ్లీష్‌లో బోధించే ప్రీ ప్రైమరీలు, ఫౌండేషన్ స్కూళ్ళు... ప్రతి మండలానికీ ఒక అధునాతన 108, ప్రతి పీహెచ్‌సీకి ఒక అధునాతన 104! ఇదీ కేవలం ఈ 26 నెలల పాలనలో మన ప్రభుత్వం మార్చిన, మార్చబోతున్న మన గ్రామ స్వరూపం.

### విద్యార్థుల కోసం...

మన పిల్లల చదువుల కోసం ఏం చేశామో చూడండి... ఈ రోజు బడిలో ఉన్న ప్రతి పాప, ప్రతి బాబు... ప్రతి ఒక్కరూ కనీసం డిగ్రీ, లేదా ప్రొఫెషనల్ విద్యను ఒక హక్కుగా చదువుకునే వాతావరణం కల్పిస్తున్నాం.

ఈతరం, వచ్చేతరం పిల్లలు ప్రపంచంలో పోటీకి నిలబడి ఎదిగేందుకు అవసరమైన వాతావరణాన్ని విద్యారంగంలో నెలకొల్పుతున్నాం. అందులో భాగంగానే గవర్నమెంటు స్కూల్‌ను కార్పొరేట్ స్కూళ్ళకు దీటుగా తీర్చిదిద్దే విధంగా నాడు-నేడు ద్వారా రాష్ట్రంలోని అన్ని గవర్నమెంట్ పాఠశాలలు, కాలేజీల రూపురేఖల్ని మారుస్తున్నాం. ఇందుకోసం ఇప్పటివరకు మొదటివిడతలో 15,715 స్కూళ్ళ కోసం చేసిన వ్యయం రూ.3,669 కోట్లు.

జగనన్న విద్యా కానుక ద్వారా గవర్నమెంటు స్కూళ్ళలో బడులు తెరిచిన రోజే పిల్లలకు కుట్టుకూలితో సహా మూడు జతల యూనిఫాంలు, స్కూల్ బ్యాగ్, బైలింగ్యువల్ టెక్ట్స్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, బెల్టు, షూస్, సాక్సులు... వీటితోపాటు ఇంగ్లీష్ - తెలుగు డిక్షనరీ... ఇవన్నీ ఉచితంగా అందిస్తున్నాం. 47.32 లక్షల పిల్లలకు మేలు చేస్తూ ఇందుకోసం ఇప్పటివరకు దాదాపు రూ. 1,400 కోట్లు ఖర్చు చేశాం.

మార్చిన మెనూ ద్వారా పిల్లలకు వారంలో ప్రతి రోజూ వేర్వేరు ఆహార పదార్థాలతో... అన్నం, పప్పుచారు, ఆకుకూర పప్పు, చిక్కీ ఎగ్‌కర్రీ, పులిహోర, టొమేటో పప్పు, ఉడికించిన గుడ్డు, కూరగాయల అన్నం, కిచిడీ, చట్నీ వంటి ఆహార పదార్థాలతో... రోజుకు ఒక మెనూతో... జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తున్నాం. 36.89 లక్షల పిల్లలకు మేలు చేస్తూ ఇందుకోసం ఏటా రూ. 1,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

గర్భిణులు, బాలింతలు, 6 సంవత్సరాల్లోపు పిల్లలు... వీరందరికీ పౌష్టికాహారాన్ని అందించే సంపూర్ణ పోషణ పథకం ద్వారా 30.16 లక్షలమందికి మేలు చేస్తూ ఏటా రూ. 1800 కోట్లు వ్యయం చేస్తున్నాం. జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా, రాబోయే తరం అవసరాలను దృష్టిలో ఉంచుకుని బడుల్లో మార్పులు చేస్తున్నాం. తద్వారా ప్రతి విద్యార్థికి వివిధ సబ్జెక్టులను బోధించే టీచర్ల సంఖ్యను గణనీయంగా పెంచుతున్నాం. రాబోయే రోజుల్లో మన బడుల్లో వివిధ సబ్జెక్టులకు వివిధ స్పెషలిస్ట్ టీచర్లు బోధించబోయే పరిస్థితి రాబోతోంది.

ప్రభుత్వ స్కూళ్ళను సీబీఎస్ఈ ఇంగ్లీష్ మీడియం స్కూళ్ళుగా మారుస్తున్నాం. ఫీజుల నియంత్రణతోపాటు, విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ దోపిడీకి నియంత్రణ కమిషన్ల ఏర్పాటు ద్వారా అడ్డుకట్ట వేస్తున్నాం. కేజీ నుంచి డిగ్రీ వరకు విద్యా సాధికారతను ప్రతి ఒక్కరూ హక్కుగా పొందగలిగేలా ఇవన్నీ చేశాం.

పెద్ద చదువులు చదివే పిల్లల కోసం జగనన్న విద్యా దీవెన ద్వారా పూర్తిగా 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు చేస్తున్నాం. ప్రతి 3 నెలలకు ఒకసారి తల్లుల ఖాతాలకే ఈ సొమ్మును జమ చేస్తున్నాం. ఇందుకోసం ఇప్పటిదాకా రూ.5,573 కోట్లు ఖర్చు చేశాం.

విద్యార్థుల బోర్డింగ్, లాడ్జింగ్ ఖర్చులకోసం జగనన్న వసతి దీవెన అమలు చేస్తున్నాం. 15.57 లక్షల విద్యార్థుకుల మేలు చేస్తూ ఇప్పటివరకు రూ.2,270 కోట్లు ఖర్చు చేశాం. పిల్లల చదువుల కోసం ఇప్పటివరకు కేవలం ఈ పథకాలకే రూ.26,677 కోట్లు ఖర్చు చేశాం.

### మహిళల కోసం...

మనది మహిళా పక్షపాత ప్రభుత్వం... 21వ శతాబ్దపు ఆధునిక భారతీయ మహిళ ఆంధ్రప్రదేశ్‌లోనే ఆవిర్భవించాలన్న లక్ష్యంతో, 44.5 లక్షల తల్లులకు మంచి జరిగేలా 85 లక్షల పిల్లలకు మంచి జరిగేలా ఏటా జగనన్న అమ్మ ఒడిద్వారా రూ.6,500 కోట్లు చొప్పున, రెండేళ్ళలో ఇప్పటికే రూ.13,023 కోట్లు అందజేశాం.

ఈ చర్యలన్నీ తీసుకున్న ఫలితంగా, 1 నుంచి 10 వరకు చదివే పిల్లల సంఖ్య 2018-19తో పోలిస్తే... ప్రైవేట్, గవర్నమెంట్ స్కూళ్ళ మొత్తం ఎన్‌రోల్‌మెంట్ కలిపి 70.43 లక్షల నుంచి 73.05 లక్షలకు పెరిగింది. కేవలం ప్రభుత్వ బడుల్నే తీసుకుంటే ఈ కాలంలోనే ఎన్‌రోల్‌మెంట్... 37.20 లక్షల నుంచి 43.43 లక్షలకు పెరిగింది. మన ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక చర్యల వల్ల ప్రతి తల్లిలోనూ, ప్రతి బిడ్డలోనూ ఆత్మవిశ్వాసం పెరిగింది.

వైయస్సార్ ఆసరా ద్వారా

8.71 లక్షల డ్వాక్రా బృందాల్లో ఉన్న 87.75 లక్షల అక్కచెల్లెమ్మలకు ఇప్పటికే కలిగిన లబ్ధి-రూ.6,792 కోట్లు. వైయస్సార్ చేయూత ద్వారా 24.56 లక్షల మంది 45-60 మధ్య వయసున్న ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు రెండు విడతలుగా అందించిన లబ్ధి-9,000 కోట్లు. ఈ సొమ్ముకు బ్యాంకుల ద్వారా మరింత రుణ సదుపాయంతో, ప్రముఖ కార్పొరేట్ సంస్థలతో టై-అప్‌లద్వారా, అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబనకు మరింతగా చేయూత ఇస్తున్నాం.

### వైయస్సార్ జగనన్న కాలనీల ద్వారా...

అక్కచెల్లెమ్మల పేరిట 31 లక్షల ఇళ్ళ పట్టాలు ఇచ్చాం, గృహ నిర్మాణం ద్వారా దాదాపు 1.25 కోట్ల మందికి... అంటే రాష్ట్ర జనాభాలో నాలుగింట ఒక వంతు మందికి లబ్ధి చేకూరుతోంది. ఇప్పటికే ఇళ్ల స్థలాలు చేతికి అందించటమే కాకుండా, మొదటి దశలో 15.60 లక్షల ఇంటి నిర్మాణాలు కూడా ప్రారంభమయ్యాయి.

ఈ ఇల్లు పూర్తి అయిన తరవాత ఒక్కో ఇంటి విలువ కనీసం రూ. 5 నుంచి 10 లక్షలు ఉంటుందనుకుంటే... ఈ 31 లక్షల మంది అక్కచెల్లెమ్మల చేతుల్లో అక్షరాలా దాదాపుగా రూ. 2 లక్షల నుంచి రూ.3 లక్షల కోట్ల సంపదను ఉంచుతున్నాం.

వైయస్సార్ సున్నా వడ్డీ ద్వారా 1 కోటీ 2 లక్షల అక్కచెల్లెమ్మలకు రూ. 2,509 కోట్లు అందించాం. అలాగే... వైయస్సార్ కాపు నేస్తం ద్వారా ఇప్పటివరకు 3.28 లక్షల అక్కచెల్లెమ్మలకు రూ.982 కోట్లు లబ్ధి చేకూర్చాం. ఇవి కాకుండా, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన ద్వారా జరిగిన మేలును ఇంతకు ముందే వివరించా!

దేశ చరిత్రలోనే తొలిసారిగా, నామినేటెడ్ పదవుల్లో, నామినేషన్‌లో కాంట్రాక్టుల్లో 50 శాతం కచ్చితంగా అక్కచెల్లెమ్మలకే ఇచ్చే విధంగా ఏకంగా చట్టం చేశాం. దీనివల్ల ఈ రోజు వివిధ నామినేటెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ల పదవుల్లో, మున్సిపల్-కార్పొరేషన్ ఛైర్మన్ల పదవుల్లో 50 శాతం మహిళలే కనిపిస్తున్నారు. అక్కచెల్లెమ్మల భద్రతకు టాప్ ప్రయారిటీ ఇస్తూ దిశ బిల్లు-దిశ పోలీస్ స్టేషన్లు-దిశ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, దిశ యాప్‌లకు రూపకల్పన చేసిన ప్రభుత్వం మనది. కుటుంబాల్లో సంతోషం నింపేలా మద్య నియంత్రణ దిశగా అడుగులు వేసిన ప్రభుత్వం కూడా మనదే.

### ఆరోగ్యం కోసం...

ఇక, మన వైద్యం-ఆరోగ్యం కోసం... వార్షిక ఆదాయం 5 లక్షలలోపు ఉన్నవారందరికీ వైయస్సార్ ఆరోగ్యశ్రీ వర్తింపజేయటం ద్వారా 95 శాతం ప్రజలకు ఆరోగ్యశ్రీ ఇస్తున్నాం.

రూ.1,000 ఖర్చు దాటితే ఉచితంగా వైద్యం అందించాలన్న తపనతోనే 2,434 ప్రొసీజర్లను ఆరోగ్యశ్రీలో చేర్చాం. ఆపరేషన్ తరవాత రోగులు కోలుకునే సమయంలో వారికి దన్నుగా నెలకు రూ.5,000 వైయస్సార్ ఆరోగ్య ఆసరాగా ఇస్తున్నాం.

ఈ 26 నెలల కాలంలో వైయస్సార్ ఆరోగ్యశ్రీ మీద రూ. 3,900 కోట్లు వ్యయం చేశాం. ఎమర్జెన్సీలో ప్రాణాలు రక్షించే 108, 104 సేవలకు అర్థం చెపుతూ ఏకంగా 1,180 వాహనాల్ని ప్రతి నియోజకవర్గానికీ పంపాం. పిల్లలూ పెద్దలందరికీ వర్తించేలా వైయస్సార్ కంటి వెలుగును అమలు చేస్తున్నాం.

ఇవి కాకుండా, గ్రామ గ్రామానా వైయస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు అవుతున్నాయి. కోవిడ్‌పై యుద్ధంలో ఇంటింటా సర్వే చేస్తూ ఫోకస్డ్ టెస్టింగ్-ట్రేసింగ్-ట్రీట్‌మెంట్ ద్వారా, అటు పేదలకు ఉచితంగా ఆరోగ్యశ్రీలో వైద్యం అందిస్తూ పేదలకు అండగా, ఇటు పరీక్షల్లోనూ, ఇటు ట్రీట్‌మెంటులోనూ అగ్రగామి రాష్ట్రంగా ముందడుగు వేశాం.

రాష్ట్రంలో ఇప్పటివరకు 11 టీచింగ్ ఆసుపత్రులు ఉంటే, కొత్తగా మరో 16 వైద్య బోధనాసుపత్రులను నిర్మాణం చేస్తున్నాం. గ్రామం నుంచి జిల్లా వరకు ఆసుపత్రుల రూపాన్ని, సేవల్ని, సదుపాయాల్ని మార్చేస్తూ జాతీయ ప్రమాణాలతో వైద్యాన్ని అందించటానికి వైద్య రంగంలో నాడు-నేడు అమలు చేస్తున్నాం. ఇందుకోసం రూ. 16,300 కోట్లు వ్యయం చేస్తున్నాం.

కోవిడ్ వల్ల తల్లి-తండ్రి ఇద్దరినీ కోల్పోయిన పిల్లలకు రూ. 10 లక్షలు డిపాజిట్ చేసి... వారి ఆలనా పాలనా చూసుకునే ఏర్పాటు చేసిన తొలి ప్రభుత్వం కూడా మనదే. మనది... మనిషిని బతికించాలనే ప్రతి ఒక్క ప్రయత్నాన్నీ మనసుతో చేసే ప్రభుత్వం.

### సామాజిక న్యాయానికి అర్థం చెపుతూ 26 నెలలుగా పాలన సాగిస్తున్నాం

దేశ చరిత్రలోనే రికార్డుగా పేదలకు 31 లక్షల ఇళ్ళ పట్టాలు అందజేసి-రెండు విడతల్లో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నాం. ఇందులో మొదటి దశ నిర్మాణాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

వైయస్సార్ కాపు నేస్తం, వైయస్సార్ మత్స్యకార భరోసా, వైయస్సార్ నేతన్న నేస్తం, వైయస్సార్ వాహన మిత్ర, జగనన్న తోడు, జగనన్న చేదోడు ద్వారా నిరు పేదలకు అండగా నిలుస్తున్నాం. అగ్రిగోల్డ్ బాధితులకు బాసటగా రెండో విడత డబ్బును కూడా ఈ నెలలోనే అందించబోతున్నాం.

ఈ 26 నెలల కాలంలోనే అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులకు ఇచ్చిన పెన్షన్లనే తీసుకుంటే... 2019 ఎన్నికలకు 6 నెలల ముందు వరకు 39 లక్షల పెన్షన్లు ఉంటే, మన ప్రభుత్వంలో 61 లక్షల పెన్షన్లకు పెంచటమే కాకుండా ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు రూ.1,000 ఇచ్చిన పెన్షన్ సొమ్మును రూ.2,250కి పెంచినది మన ప్రభుత్వమే. అలాగే, గత హయాంలో నెలకు రూ. 500 కోట్లుగా ఉన్న పెన్షన్ బిల్లు... నేడు రూ. 1500 కోట్లకు చేరింది.

రాజ్యాంగం పీఠికలో రాసిన సోదరభావానికి (ఫ్రెటర్నిటీకి) అర్థం చెపుతూ... సామాజిక న్యాయాన్ని అమలు చేసి చూపాం. మంత్రివర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి 60 శాతం పదవులు ఇచ్చినదీ మనమే!

### నిరుద్యోగుల కోసం...

ఉద్యోగాల విషయానికి వస్తే... సగర్వంగా తెలియజేస్తున్నాను! ఈ 26 నెలల్లోనే అక్షరాలా 1.84 లక్షల శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. మన కళ్ళ ఎదుటే 1.3 లక్షల శాశ్వత ఉద్యోగులు గ్రామ/వార్డు సచివాలయాల్లో కనిపిస్తున్నారు. ప్రభుత్వంలో విలీనమైన ఆర్టీసీలో 52 వేల మంది కనిపిస్తున్నారు. 2.7 లక్షల మంది మన కళ్ళ ఎదుటే, 50 ఇళ్లకు ఒకరు చొప్పున వాలంటీర్లుగా కనిపిస్తున్నారు. 95,212 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆప్కాస్ ద్వారా న్యాయం చేశాం. మరో 20 వేల మందికి కాంట్రాక్ట్ ఉద్యోగాలిచ్చాం. ఇలా అక్షరాలా ఈ 26 నెలల్లోనే 6.03 లక్షల మంది మన కళ్ళెదుట కనిపిస్తున్నారు. సామాజిక న్యాయానికి అద్దం పడుతూ ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కనీసం 75 శాతానికి పైగా ఉద్యోగాలు లభించాయని సగర్వంగా, సవినయంగా తెలియజేస్తున్నాను.

అయిదు ఉప ముఖ్యమంత్రి పదవుల్లో నాలుగు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు ఇచ్చిన తొలి ప్రభుత్వం మనది. నామినేటెడ్ పదవుల్లో, నామినేటెడ్ కాంట్రాక్టుల్లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు చట్టం చేసి 50 శాతం ఇచ్చాం. నామినేటెడ్ పదవుల్లో, నామినేటెడ్ కాంట్రాక్టుల్లో మహిళలకు 50 శాతం చట్టం చేసి ఇచ్చాం.

### శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు

చేయటంతోపాటు... ఎస్సీ ఎస్టీలకు వేర్వేరు కమిషన్ల దిశగా అడుగులు వేశాం. ఎస్సీల్లో మాల, మాదిగ, రెల్లి... మూడు కార్పొరేషన్లు ఏర్పాటు. బీసీలకు ప్రత్యేకించి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. మార్కెట్ యార్డుల ఛైర్మన్లు, దేవస్థానాల కమిటీల ఛైర్మన్లుగా, సభ్యులుగా ఈ రోజు పేద సామాజిక వర్గాలవారు సగభాగం కనిపిస్తున్నారని సగర్వంగా, సవినయంగా తెలియజేస్తున్నాను.

అంతే కాకుండా, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీ ఛైర్మన్లలో కూడా సగ భాగం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చాం. నెల రోజుల క్రితం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో సగభాగానికి మించి 58 శాతం పదవుల్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇవ్వటంతోపాటు... సగం పదవులు మహిళలకు ఇచ్చాం.

### ఇక ఉద్యోగుల జీతాల విషయంలో...

గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా, అధికారంలోకి వచ్చిన వెంటనే, ప్రభుత్వోద్యోగులకు 27 శాతం ఐ ఆర్ ఇచ్చాం. కాంట్రాక్టు ఉద్యోగులకు టైం స్కేల్ ఇచ్చాం.

అంగన్‌వాడీల్లో పని చేస్తున్నవారికి, ఆశా వర్కర్లకు, మధ్యాహ్న భోజన కార్మికులకు, శానిటరీ వర్కర్లకు, హోం గార్డులకు, 104-108 సిబ్బందికి, పారిశుద్ధ్య కార్మికులకు... ఇలా అనేక విభాగాల్లో పనిచేస్తూ చాలని వేతనాలతో బతుకుబండి ఈడుస్తున్న 7,02,656 మందికి లబ్ధి చేకూర్చేలా వేతనాలు పెంచాం. ఉద్యోగులకు చేయాల్సినవి మరి కొన్ని ఉన్నాయన్నది నాకు తెలుసు. వారందరికీ న్యాయం చేసేలా రాబోయే రోజుల్లో మరి కొన్ని నిర్ణయాలు తీసుకుంటాం.

గత ఒకటిన్నర సంవత్సరంలో ఎన్నో సవాళ్ళు ఎదుర్కొన్నాం. మానవాళి చరిత్రలోనే అత్యంత గడ్డుకాలాన్ని ఎదుర్కొన్నాం. కనిపించని శత్రువు చేస్తున్న దాడిని ఎదుర్కొనే విషయంలో పూర్తి సైన్యంతో మొత్తం శక్తినంతా కూడదీసుకుని ఎదురించాలి.

కోవిడ్ దాడివల్ల ప్రభుత్వానికి కష్టాలు వచ్చాయి... గత 16 నెలల కాలాన్నే తీసుకుంటే రెవెన్యూ మనం ఆశించిన రీతిలో రాలేదు. వ్యయం మాత్రం మనం అనుకోని విధంగా పెరిగింది. ఇలాంటి పరిస్థితి ఒక కుటుంబానికే వస్తే ఆ కుటుంబం ఎంతగా తల్లడిల్లుతుందో అర్థం చేసుకుని... ఆ పరిస్థితి ఏ కుటుంబానికీ రాకూడదని ప్రభుత్వంగా తపించాం. అవినీతికి, వివక్షకు తావు లేని విధంగా ప్రతి ఒక్క రూపాయి ప్రజలకే నేరుగా ఇచ్చాం.

ప్రతి ఒక్క కుటుంబం నిన్నటికంటే నేడు... నేటి కంటే రేపు... ప్రతి ఒక్క సామాజికవర్గం నిన్నటి కంటే నేడు... నేటి కంటే రేపు... ప్రతి ఒక్క ప్రాంతం... నిన్నటి కంటే నేడు... నేటి కంటే రేపు బాగుండేలా మన ప్రభుత్వం ప్రతి రూపాయినీ బాధ్యతగా ఖర్చు చేస్తోంది.

భవిష్యత్తును ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ ప్రభుత్వం మీది. మీరిచ్చిన అధికారంతో నేను సేవకుడిగా మాత్రమే ఇక్కడ ఉన్నాను. 74 ఏళ్ల తరవాత కూడా... ఈ రోజుకూ కనిపిస్తున్న వ్యవస్థాగత లోపాలను సరిదిద్దేందుకే ఇక్కడ ఉన్నాను.

**స్వాతంత్ర్యానికి, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, సమానత్వానికి ఆచరణలో అర్థం చెపుతూ మన రాష్ట్రం ముందడుగు వేస్తోందని సగర్వంగా చెపుతూ... దేవుడి దీవెనలు, ప్రజలందరి చల్లని ఆశీస్సులు ఈ రాష్ట్రంలో, ఈ దేశంలో ప్రతి ఒక్క కుటుంబానికీ... వారందరితోపాటు మనందరి ప్రభుత్వానికి లభించాలని నిండు మనసుతో కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను!**

COVID-19 HELPLINE 104

vitap.ac.in
admission@vitap.ac.in
0863-2370444

# విద్య పర్యాటకం సాంస్కృతికం వ్యాపారం

srmap.edu.in
admissions@srmap.edu.in
800-599-2233

## అన్సంగ్ హీరోలకు వారి సేవలకు సన్మానం: వి.ఐ.టి-ఏ.పి



◆ వి.ఐ.టి.-ఏ.పిలో ఘనంగా 75వ గణతంత్ర దినోత్సవ సంబరాలు

◆ అన్సంగ్ హీరోలకు వారి సేవలకు సన్మానం-వి.ఐ.టి.-ఏ.పి

**రాజధాని వార్తలు, అమరావతి:** వి.ఐ.టి-ఎ.పి విశ్వవిద్యాలయంలో జరిగిన 75వ స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా, హరనాథ్ అనమల, వ్యవస్థాపక కార్య నిర్వహణ అధికారి NADSOL టెక్నో ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ 100 అడుగుల జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. పిదప అన్సంగ్ హీరోలకు వారి సేవలకు స్క్రోల్ ఆఫ్ హానర్, నగదు అవార్డులను అందజేసింది. యూనివర్సిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా మానవత్వానికి నిస్వార్థ సేవ చేసినందుకు గుర్తుగా అన్సంగ్ హీరోలను సన్మానించేందుకు భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఎంచుకున్నందుకు విశ్వవిద్యాలయ అధికారులను ముఖ్య అతిథి అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ డ్రైవర్లు మిస్టర్ షేక్ షఫి ,(దివంగత) ఎండీ సుభాని లను ప్రజల ప్రాణాలను కాపాడినందుకు సన్మానించారు. తమ విధులను శ్రద్ధగా నిర్వర్తించిన ఆరు అగ్నిమాపక సిబ్బంది జె. రమణయ్య, సహాయ. జిల్లా ఫైర్ ఆఫీసర్, తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ, పి. సతీష్, లీడింగ్ ఫైర్మ్యాన్, జగనైక్పూర్ ఫైర్ స్టేషన్, తూర్పు గోదావరి జిల్లా, పి.వి.వి. సత్యనారాయణ, ఫైర్మ్యాన్, జగనాయిక్పూర్ ఫైర్ స్టేషన్, తూర్పు గోదావరి జిల్లా, శ్రీ ఎస్. వర ప్రసాద్, డ్రైవర్ ఆపరేటర్, కొత్తవలస ఫైర్ స్టేషన్, విజయనగరం జిల్లా,సి హెచ్ మేష్ వర్మ, డ్రైవర్ ఆపరేటర్, విజయనగరం జిల్లా విజయనగరం ఫైర్ స్టేషన్, శ్రీ బి. రామ కృష్ణ, ఫైర్మ్యాన్, విజయనగరం ఫైర్ స్టేషన్, విజయనగరం జిల్లా లను ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడినందుకు సన్మానించారు.

ఈ సందర్భంగా ప్రఖ్యాతి చెందని వీరుల-అన్సంగ్ హీరోల సేవలను గుర్తించి సాధారణ ప్రజల ప్రాణాలను, విలువైన అటవీ సంపదను కాపాడిన ఐదుగురు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసులు ఆర్. విజయ కృష్ణ అర్జున్, HG-295, కాకినాడ, D. వేణు, PC-361, సోమశిల PS, నెల్లూరు జిల్లా, M. కులయప్ప, ARPC-3279, DAR, కడప జిల్లా, డి.యు.మహేశ్వరరావు, HC-614, సి.హెచ్. ఏసురత్నం,RSI లను సత్కరించారు.ఈ సందర్భంగా ఉప కులపతి డా. ఎస్ .వి. కోట రెడ్డి మాట్లాడుతూ పరాక్రమం , ధైర్యాన్ని గుర్తించాల్సి ఉందని, అప్పుడే యువతరం దేశం పట్ల నిస్వార్థంగా, దేశభక్తితో ఉండటాన్ని అర్థం చేసుకుంటుందని అన్నారు. వి.ఐ.టి-ఎపి రిజిస్ట్రార్ డాక్టర్ సిఎల్వి.శివకుమార్, డాక్టర్ అనుపమ నంబూరు, అసిస్టెంట్డైరెక్టర్స్టూడెంట్ వెల్ఫేర్, ఫ్యాకల్టీ, సిబ్బంది కూడా పాల్గొన్నారు

# విద్యార్థులను పరిశోధనల వైపు...

● భారత్లో వేగంగా 5జీ టెక్నాలజీ అభివృద్ధి ఏపీ ఎస్ఆర్ఎం 'రీసెర్చ్ డే'లో ప్రొఫెసర్ యూబీ దేశాయ్

● విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లకు గోల్డుమెడల్స్ ప్రదానం

**రాజధాని వార్తలు, అమరావతి::** పరిశోధనతో ముడిపడ్డ పాఠ్య ప్రణాళికల ద్వారా విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టాలని హైదరాబాద్లోని అనురాగ్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ యూబీ దేశాయ్ ప్రభుత్వ, ప్రయివేటు యూనివర్సిటీలకు సూచించారు. పరిశోధనల పట్ల ఆకర్షితులయ్యే విధంగా ఆయా యూనివర్సిటీల బోధనా ప్రణాళికలు ఉండాలని పేర్కొన్నారు. శనివారం(21 /08 /2021 ) ఉదయం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ తన మూడవ 'రీసెర్చ్ డే' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దృశ్యమాధ్యమ (వర్చువల్) పద్ధతిలో హాజరైన యూబీ దేశాయ్ దేశంలో 5జీ పురోగమనంపై ప్రసంగించారు.

రానున్న దశాబ్ధంలో శాస్త్ర సాంకేతిక రంగాలు వేగంగా అభివృద్ధి చెందనున్నాయనీ, భారత్లోని శాటిలైట్ కమ్యూనికేషన్స్, వైర్లెస్ వ్యవస్థల్లో విప్లవాత్మకమైన మార్పులు రానున్నాయన్నారు. 5జీ టెక్నాలజీ పరిణామ క్రమాన్ని వివరిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఐవోటీ వంటి టెక్నాలజీలకు ప్రాముఖ్యత మరింత పెరుగుతుందన్నారు. అనంతరం దేశాయ్ 5జీ యూసేజ్ సినారియోను వివరించారు. పరిశోధనలకు పెద్దపీట వేస్తున్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీని ఆయన అభినందించారు.



రీసెర్చ్ డే బుక్లెట్స్ను ఆవిష్కరిస్తున్న ఎస్ఆర్ఎం వైస్ ఛాన్సలర్ వీఎస్ రావు, పక్కన ప్రో వీసీ ప్రొఫెసర్ నారాయణరావు



విద్యార్థికి గోల్డు మెడల్ ప్రదానం చేస్తున్న వీసీ ప్రొఫెసర్ వీఎస్ రావు



విద్యార్థినికి గోల్డు మెడల్ ప్రధానం చేస్తున్న ప్రో వీసీ ఆచార్య నారాయణరావు

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020లో పేర్కొన్న విధంగా యూజీ, పీజీ స్థాయి బోధనాంశాల్లోనూ పరిశోధనలకు ప్రాముఖ్యత కల్పించడం అవసమని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వీఎస్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం రీసెర్చ్ కమిటీని ప్రత్యేకంగా అభినందించారు. ప్రొ వైస్ చాన్సలర్ ఆచార్య డి. నారాయణరావు మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలలో పరిశోధనల పాత్ర కీలకమన్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ స్టూడెంట్స్ రీసెర్చ్ బేస్డ్ సెంటరు కలిగి ఉందన్నారు. సృజనాత్మక టెక్నాలజీకి ఎప్పటికప్పుడు మెరుగులు దిద్ది, ఆ దిశగా విద్యార్థులను, ఫ్యాకల్టీలను ప్రోత్సహిస్తున్నామని నారాయణరావు పేర్కొన్నారు. అనంతరం ముఖ్య అతిథి యూబీ దేశాయ్ తరపున వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వీఎస్ రావు రీసెర్చ్ డే అబ్ స్ట్రాక్ట్ బుక్ లెట్ ను ఆవిష్కరించారు.

**విద్యార్థులకు గోల్డు, సిల్వర్ మెడల్స్.....**

ఈ సందర్భంగా పరిశోధనల పరంగా విశేషమైన ప్రతిభ కనబరిచిన 36 మంది, విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లకు యూనివర్సిటీ గోల్డు, సిల్వర్ మెడల్స్, ప్రశంసా పత్రాలను ప్రదానం చేసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ శివకుమార్, అసోసియేట్ డీన్ రఘునాథన్, స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ డీన్ బండి కామయ్య, రీసెర్చ్ డే కన్వీనర్లు డాక్టర్ ఎ కార్తీక్ రాజేంద్రన్, డాక్టర్ మహేశ్, డాక్టర్ మురళీ, ప్రొఫెసర్ రంజిత్ థాపా, డాక్టర్ షీలా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

COVID HELPLINE 104

# మీవాడు సీఎం కాకపోతే..ఇంత ఫ్రస్ట్రేషనా!

## 1వ పేజీ తరువాయి

పనిగట్టుకుని బురద చల్లుతారా' అని వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమవాడు సీఎం కాకపోతే వీరి ఫ్రస్ట్రేషన్ ఇంత పీక్లో ఉంటుందా అన్నట్టుగా సిగ్గూ ఎగ్గూ లేకుండా ప్రభుత్వంపైన, సీఎం జగన్పైన పథకం ప్రకారం కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో జరుగుతున్న మంచి.. చంద్రబాబు పాలనలో జరిగిన చెడు ఎల్లో మీడియాకు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన 26 నెలల్లోనే రూ.1.40 లక్షల కోట్లను పేదవాడి బాగు కోసం ఖర్చు చేస్తే మీకెందుకు కడుపుమంట అని నిలదీశారు. పేదవాడు బాగుపడితే.. రైతు బాగుపడితే.. తద్వారా రాష్ట్రం బాగుపడితే.. చంద్రబాబు అండ్ కో కి నిద్రపట్టదా అని ప్రశ్నించారు. రామకృష్ణారెడ్డి ఇంకా ఏమన్నారంటే..

◆ **పాఠశాలల దుస్థితికి చంద్రబాబు కారణం కాదా?**

'సీఎం ఇంటి పక్కనే ఇలా..' అంటూ ఈనాడులో తాడేపల్లిలోని రెండు స్కూళ్ల ఫొటోలతో ఓ వార్త రాశారు. టీడీపీ హయాంలో బడుల్లో కనీసం బెంచీలు, కుర్చీలు, టేబుళ్లు, బ్లాక్ బోర్డులకు కూడా నోచుకోక ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో అన్న దానికి ఆ వార్త అద్దం పడుతోంది. పదేళ్ల సైకిల్ కాంగ్రెస్ పాలనలో నాశనమైన ప్రభుత్వ బడులకు ఇది నిదర్శనం. మరోవైపు జగనన్న పాలనలో ఇలాంటి స్కూళ్లకు ఎలా మోక్షం కలుగుతోందో కూడా అందరికీ అర్థమవుతోంది. రాష్ట్రంలో ప్రతి ఒక్క సర్కారు బడినీ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సీఎం వైఎస్ జగన్ మారుస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 57 వేల ప్రభుత్వ బడులను నాడు-నేడు కింద అభివృద్ధి చేస్తున్నారు. మొదటి దశలో దాదాపు రూ.3,700 కోట్లు ఖర్చు చేసి 15,715 పాఠశాలలను అభివృద్ధి చేశారు. రెండోదశ పనులకూ శ్రీకారం చుట్టారు. స్కూళ్ల అభివృద్ధికి ఏకంగా రూ.16 వేల కోట్ల నుంచి రూ.17 వేల కోట్లు ఖర్చు చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఇది. ఇది అభివృద్ధిలా కనిపించటం లేదా. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ఈ ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మక చర్యల వల్ల ప్రతి తల్లి, ప్రతి బిడ్డలోనూ ఆత్మవిశ్వాసం పెరిగింది. బహుశా తమ కార్పొరేట్ స్కూళ్ల బేరాల కోసమే ఈ పద్ధతిలో ఎల్లో మీడియా వార్తలు రాస్తుందా. విద్యార్థుల జీవితాలను మార్చేందుకు స్కూళ్లను అభివృద్ధి చేస్తుంటే.. వాస్తవాలు రాయాలని ఈనాడుకు ఎందుకు అనిపించలేదు. కనీసం సూచనలు, సలహాలు ఇస్తూ అన్నీ రాశారా అంటే అదీ లేదు. చంద్రబాబు ఊళ్లో.. నారావారిపల్లె పక్కనే చంద్రబాబు చదువుకున్న స్కూల్ శిథిలావస్థకు చేరితే దాన్ని జగన్ అధికారంలోకి వచ్చాక తప్ప బాగు పడలేదు. ఇవి ఈనాడుకు, మిగతా ఎల్లో మీడియాకు ఎందుకు కనిపించవు.

◆ **అప్పులు పుట్టకూడదని పిటిషన్ వేయించింది వాళ్లు కాదా**

రాష్ట్ర ప్రభుత్వానికి ఎక్కడా అప్పు పుట్టకూడదని, స్టేట్ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్కు బ్యాంకుల నుంచి రుణాలు రాకూడదనే దురుద్దేశంతో నళినీ కుమార్ అనే ఈనాడు అడ్వకేట్, టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణతో పిటిషన్ వేయించింది రామోజీ, చంద్రబాబు కాదా. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ రూ.లక్షన్నర కోట్లు అప్పులు చేసి తన కాంట్రాక్టర్లకు, బినామీలకు దోచిపెట్టింది. సీఎం జగన్ రూ.1.40 లక్షల కోట్లను సంక్షేమ కార్యక్రమాల ద్వారా డీబీటీ విధానంలో ఒక్క పైసా అవినీతి లేకుండా ప్రతి పేదవాడికి అందేవిధంగా చూస్తున్నారు. చేతనైతే వాస్తవాలు రాయండి, చిన్న చిన్న పొరపాట్లు జరిగితే సూచనలు, సలహాలు ఇవ్వండి. ఇటీవల కాలంలో మా పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు మాట్లాడే మాటలను వక్రీకరించి మిమిక్రీ ఆర్టిస్టులతో రికార్డు చేసి.. వైఎస్సార్సీపీని, ప్రభుత్వాన్ని అభాసు పాల్జేయాలని కొందరు చూస్తున్నారు. మీ కుట్రల అంకంలో ఇదే చిట్ట చివరి మెట్టు. రాజకీయాల్లో ఇది మంచిది కాదు. ఇప్పటికైనా మారండని హెచ్చరిస్తున్నాం.

◆ **ఈనాడు రామోజీ పాడు బుద్ధి**

'రైతుల గుండెల్లో మీటర్ల మోత' అంటూ మరో కథనాన్ని రాశారు. చంద్రబాబు అధికారంలో ఉండగా కరెంటు బకాయిలు కట్టలేదని రైతులపై నిర్ధాక్షిణ్యంగా అక్రమ కేసులు పెట్టి, స్పెషల్ పోలీస్ స్టేషన్లు, స్పెషల్ కోర్టులు పెట్టి వేధించినప్పుడు ఒక్క వార్త అయినా రామోజీ రాశారా. రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ పగటి పూటే 9 గంటలు ఇస్తుంటే గుండెల్లో మీటర్లు అని రాస్తారా. రాష్ట్రంలోని ప్రతి పొలంలోని ప్రతి రైతుకు నాణ్యమైన విద్యుత్ వస్తోందా లేదా అన్నది తెలుసుకునేందుకు మీటర్లు పెడుతున్నాం. లో వోల్టేజీ, హై వోల్టేజీతో మోటార్లు కాలిపోకుండా ఉపయోగపడేందుకు ఫీడర్లు, లోడ్ సరి చూసుకునేందుకే వీటిని పెడుతున్నాం. వీటివల్ల రైతులపై ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడదు. 9 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తుంటే, రైతన్నల కోసం కనీవినీ ఎరగని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంటే మీకు ఎందుకు నచ్చటం లేదు.



ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా మెటుకూరు చిరంజీవి రెడ్డి ప్రమాణ స్వీకారం



ముఖ్యమంత్రి శ్రీవైఎస్ జగన్ను మర్యాదపూర్వకంగా కలిసిన తూ.గో.జిల్లా కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి.చిర్ల జగ్గిరెడ్డిని ప్రభుత్వ విప్గా నియమిస్తూ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.



ఏపీ ఎన్విరాన్మెంట్ మానేజ్మెంటు చైర్మన్ గా గుబ్బా చంద్రశేఖర్ ప్రమాణ స్వీకారం

'S' Rice Suppliers
"Eat Healthy Rice"
Vijayawada - 9849741984

# టూరిజం అభివృద్ధి

● కరోనా ప్రభావం తగ్గిన వెంటనే టూరిజం అభివృద్ధి

● కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి

**రాజధాని వార్తలు,విజయవాడ:** కరోనా ప్రభావం తగ్గిపోయిన వెంటనే అంటే వచ్చే జనవరి 1 నాటికి దేశంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తెలుగు ప్రజల ఆశీర్వాదం కోసం వచ్చానన్నారు. గురువారం ఇంద్రకీలాద్రి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన సెంట్రల్ మినిస్టర్ కిషన్ రెడ్డికి ఆలయం వద్ద పూర్ణకుంభంతో మేళతాళాలతో మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు ఆలయ అధికారులు ,మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, బీజేపీ నాయకులు. దుర్గమ్మ ను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు కిషన్ రెడ్డి. ఈయనతోపాటు దుర్గమ్మను రాజ్యసభ సభ్యులు సిఎం రమేష్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోమూవీర్రాజు, మాధవ్ తదితరులు దర్శనం చేసుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద పండితుల చేత వేద ఆశీర్వచనం తీసుకున్నారు. అమ్మ వారి చిత్రపటాన్ని, లడ్డూ ప్రసాదాన్ని మంత్రి కిషన్ రెడ్డికి అందజేశారు దేవాదాయ శాఖ కమిషనర్ వాణిమోహన్ ,ఈవో భ్రమరాంబ.



**తెలుగు ప్రజల ఆశీర్వాదం కోసమే వచ్చా**

ఆలయం వెలుపల మీడియాతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర మంత్రి గా బాధ్యతలు స్వీకరించాక తెలుగు ప్రజల ఆశీర్వాదం కోసం వచ్చానన్నారు. నిన్న తిరు వెంకన్న స్వామిని, ఇవాళ దుర్గమ్మను దర్శించుకున్నానని చెప్పారు. దేశ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించాలని మోడీ అకాంక్ష అని, వరంగల్ లో వీరభద్ర దేవాలయాన్ని యునెస్కో హెరిటేజ్ సెంటర్ గా గుర్తించిందని తెలిపారు. రానున్న రోజుల్లో ఏపీలో 126 కేంద్రాలున్నాయని, వాటిని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలను పిలిచి సిఎస్ఆర్ ఫండ్ కింద డెవలప్ చేస్తామన్నారు.

**పర్యాటక శాఖ ఛాలెంజ్ తో కూడుకుంది**

పర్యాటక శాఖ చాలా ఛాలెంజ్ తో కూడుకున్నదని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గత రెండేళ్లుగా కోవిడ్ తో టూరిజం చాలా దెబ్బతినిందని ఆయన గుర్తు చేశారు. జనవరి 1 నాటికి కోవిడ్ తగ్గగానే టూరిజాన్ని మరింత డెవలప్ చేస్తామన్నారు. భారత్ దర్శన్ ద్వారా చారిత్రాత్మక కట్టడాల విశిష్టతను అందరికీ తెలిపే విధంగా కార్యక్రమాలు చేపడతామన్నారు. తెలుగువాడిగా పర్యటక శాఖ ద్వారా నా వంతు సహకారం అందిస్తానన్నారు. ఏపి, తెలంగాణ రెండు రాష్ట్రాలు ప్రధాని నరేంద్ర మోడీకి రెండు కళ్లు లాంటివని కిషన్ రెడ్డి అభివర్ణించారు. సీఎం జగన్ మర్యాద పూర్వకంగానే ఆహ్వానించారని కిషన్ రెడ్డి తెలిపారు. తెలుగు వాడికి కేంద్రమంత్రి అవకాశం రావడంతోనే తేనేటి విందుకు ఆహ్వానించారని స్పష్టం చేశారు. దుర్మమ్మ ఆలయాన్ని టూరిస్ట్ స్పాట్ గా తీర్చిదిద్దేందుకు నా సహకారం అందిస్తానన్నారు.

**తాడేపల్లిలో సీఎం జగన్ తో మర్యాదపూర్వక భేటీ**

కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా విజయవాడకు వచ్చిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లి సీఎం జగన్ తో భేటీ అయ్యారు. క్యాంపు కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో సిఎం జగన్ సమావేశమయ్యారు. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని భేటీ అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

Reachout to 2 Lakh readers via
Rajadhani Vartalu Call us: 94406 62699

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh; Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur dist, Andhra Pradesh-522237; Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015 / 66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699,Email: rajadhanivartalu@gmail.com